## ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్


విద్యార్థులో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 25 : జిల్లాలోని రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కు మార్ ఝూ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మండల పరిధిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో హార్వేస్టర్లతో సమావేశం నిర్వహించి, పంట కోతల సమయంలో పాటించాల్సిన నిబంధనలపై సలహాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రజిత, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, డీఎం మార్కెటింగ్ ప్రకాశ్, డీసీవో రామకృష్ణ, వ్యవసాయ అధికారి రామారావు, తూనికలు కొలతల అధికారి రూపేశ్, అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టరేట్, మార్చి 25: మిడ్ మానేరు, అనంతగిరి రిజర్వాయర్ కింద ముంపుకు గురైన (గుర్రంవాణిపల్లి, చీర్లవంచ, చింతలఠాణా, కొదురుపాక, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి, అనుపురం, కొడిముంజ, వరదవెల్లి, శాభాష్ పల్లి) గ్రామాల ప్రజలు ఏప్రిల్ 11 లోపు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం మీసేవ కేంద్రంలో, జిల్లా వెబ్ సైట్ https:// rajannasircilla.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలి

వేములవాడ రూరల్, మార్చి 25 : విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని కలెక్టర్ సదీప్‌కుమార్ ఝూ పిలుపునిచ్చారు. మండలంలోని హన్మాజీపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల వివరాలు ఆరా తీశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.

## పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్, మార్చి 25: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు సూచించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, డీఈఈటీ, పీఎం.ఐఎస్, విశ్వకర్మ యోజన అంశాలపై యువత, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఐటీఐ, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు దాదాపు 500 మందికి మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. డీఆర్డీవో శేషాద్రి, ఏడీ ఇండస్ట్రీస్ భారతి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

వేములవాడ, మార్చి 25 : విద్యార్థులు తప్పనిసరిగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వెంకట రమణ సూచించారు. వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు ఆదా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ అర్బన్ ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బన్నా జీ, ఉపాధ్యాయులు చిప్పయాదగిరి, హరికృష్ణ ఉన్నారు.

## యువకుడి వైద్యానికి ఆర్థిక సాయం అందజేత

రుద్రంగి, మార్చి 25 : మండలకేంద్రానికి చెందిన పడాల శ్యామ్ 15 రోజుల కితం ఆటోబోల్తా పడి తీవ్ర గాయాలై మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన పద్మశాలీ సంఘం సభ్యులు రూ. 61 వేలు ఆర్థిక సాయం చేసి, అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంకా ఎవరైన దాతలు ముందుకు వచ్చి శ్యామ్‌కు ఆర్థిక సాయం అందించాలని కోరారు. పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**పోయినది**

★కొమ్మనేని మల్లయ్య, S/o. కిష్టయ్య, గ్రా॥ మానువాడ, మం॥ బోయినపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా, నాయొక్క పాస్‌పోర్టు నం. G-1156266 తేది: 12-3-25 రోజున మానువాడ నుండి వెంకట్రావ్‌పల్లికి వెళ్తుండగా పోయింది. దొరికిన వారు సంప్ర॥ 96668 16692.
NTK-00000

**పత్రికా ప్రకటన**

ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా (Revelly) రెవెల్లి మనోజ్ తండ్రి: సారయ్య, నివాసము: నాగారం గారు తనయొక్క పేరును (Revelli) రెవెల్లి మనోజ్ తండ్రి: సారయ్య గా మార్చుకొనుటకు దరఖాస్తు సమర్పించినారు. కావున ఇట్టి విషయములో ఎవరికైనా అభ్యంతరము ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (7) రోజులలోపు ఈ దిగువ సంతకము చేసిన అధికారి ఎదుట సంబంధిత ఆధార పత్రములతో హాజరు కాగలరు. లేనిచో ఇట్టి విషయములో నిబంధనల ప్రకారం తదుపరి చర్య తీసుకోవడం జరుగుతుంది.
సం/- **తహసీల్దార్**
మం॥ కమాన్‌పూర్, జి॥ పెద్దపల్లి

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

### చలివేంద్రం ప్రారంభం

గంభీరావుపేట, మార్చి 25 : మండలంలోని లింగన్నపేట బస్టాండులో శ్రీ హరిహర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ శ్రీకాంత్ ప్రారంభించారు. శృంగేరి పీఠం ఉపాసకుడు రాధాకృష్ణశర్మ, నేతలు దయాకర్‌రావు, రాజు, అంజయ్య, కిష్టయ్య, ఆటో యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

### పీడిఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, మార్చి 25: మండలంలోని రెండు గ్రామాల్లో సీసీఎస్ పోలీసులు దాడులు మంగళవారం నిర్వహించారు. 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోతుగల్ శివారులో పట్టుకున్నట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు.

# రాజకీయ అజ్ఞాని బండి సంజయ్

- కేసీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేసిండు
- నిరూపణ చేయకపోతే ముక్కు నేలకు రాయాలి
- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వేణు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

సిరిసిల్ల టౌన్, మార్చి 25 : రాజకీయ అజ్ఞానిలా బండి సంజయ్ మాట్లాడుతున్నారని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు విమర్శించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి చేయాలని కరీంనగర్ ప్రజలు అతన్ని గెలిపిస్తే సంజయ్ మాట్లాడే మాటలతో వారు తలదించుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్పొరేటర్‌కు ఎక్కువ మేయర్‌కు తక్కువ అన్న తరహాలో వ్యవహార శైలి ఉందన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి తెలంగాణ ప్రధాత కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీదర్‌లో దొంగ నోట్లు ముద్రించి తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో పంపిణీ చేశారని, చేసిన ఆరోపణలు అర్థరహితంగా ఉన్నాయన్నారు. గలీజు రాజకీయాలకు ఇప్పటికైనా స్వస్థి పలకాలని హితవు పలికారు. పార్లమెంట్‌లో కరీంనగర్ సమస్యలపై, అభివృద్ధిపై ఏ ఒక్క మాట మాట్లాడలేదన్నారు. రెచ్చగొట్టే రాజకీయాలు తప్ప అభివృద్ధి చేయడం చేతకాదన్నారు. కేసీఆర్‌పై చేసిన దిక్కుమాలిన ఆరోపణలపై విచారణ జరిపించి రుజువు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు రుజువు చేయకపోతే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జక్కుల నాగరాజు, కుంబాల మల్లారెడ్డి, ఒజ్జల అగ్గిరాములు, గజభీంకార్ రాజన్న, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, ప్రేమ్‌కుమార్, సిఖిందర్, కాసర్ల పవన్, బుర్ర సాయి ఉన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గితె

కోనరావుపేట, మార్చి 25 : సైబర్ నేరాలు, అక్రమ గేమింగ్, బెట్టింగ్ యాప్స్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మహేశ్ బీ గితె సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలు, కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలు, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదుల్లో ఎటువంటి జాప్యం చేయొద్దన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తీర్చాలని సూచించారు. ప్రజలకు సైబర్‌నేరలపై, అక్రమ బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, ట్రైని ఎస్ఐ రాహుల్ రెడ్డి ఉన్నారు.

## నవోదయకు ఎంపిక

కోనరావుపేట, మార్చి 25 : మండలంలోని నిమ్మపల్లిలో మణికంఠ యూపీఎస్ పాఠశాలలో చదువుతున్న శ్రీధన్, అద్వైత్ నాయక్ విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారని పాఠశాల నిర్వహకుడు లక్ష్మారెడ్డి తెలిపారు. పాఠశాల నుంచి విద్యార్థులు నవోదయకు ఎంపికకావడంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.


శ్రీధన్


అద్వైత్ నాయక్

## బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ


పరామర్శిస్తున్న చల్మెడ

చందుర్తి, మార్చ్ 25 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్యాలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పోతరాజు గంగాధర్, మండలకేంద్రానికి చెందిన పాత్రికేయుడు మర్రి నిశాంత్ కూతురు అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాలను మంగళవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు ఎల్లయ్య, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రాజు, మాజీ ఎంపీపీ పెంటయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్, అశోక్ కార్యకర్తలున్నారు.

# వెంటాడిన విధి

- చీర్లవంచలో ప్రాణం తీసుకున్న వడ్రంగి కార్మికుడు
- ఓ వైపు అనారోగ్యం, మరో వైపు ఆర్థిక ఇబ్బందులు
- కుటుంబ భారం మోయలేక బలవన్మరణం

సిరిసిల్ల రూరల్, మార్చి 25: విధి వెంటాడింది. ఆ ఇంటి పెద్దను బలితీసుకున్నది. ఓవైపు అనారోగ్యం.. మరోవైపు పిల్లలకు బుద్ధి మాంధ్యం.. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులతో వడ్రంగి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోగిలోజు విష్ణు (44) వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన ఇద్దరు పిల్లలలో కుమారుడికి రేచికట్లు, మంద బుద్ధి, కూతురుకు మానసిక ఎదుగుదల సరిగా లేకుండా ఉన్నారు. అయితే కొద్దిరోజుల క్రితం విష్ణుకు పక్షవాతం వచ్చింది. ఏమి పని చేయలేని స్థితిలో ఉండిపోయాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఏం చేయాలో తెలియక, కుటుంబభారాన్ని యోయలేక క్రమంలో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. మంగళవారం తన ఇంటిలోని బాత్రూంలో ఇనుప రాడ్‌కు ఉరేసుకున్నాడు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


విష్ణు (ఫైల్)

### 'మాయమైన' మనిషి కవిత్తపుస్తకావిష్కరణ

వేములవాడ రూరల్, మార్చి 25: అగ్రహారం డిగ్రీ కళాశాలలో భాషా సాంస్కృతిక శాఖ, ప్రభుత్వం, తెలుగు శాఖ, మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాహిత్య సదస్సులో భాగంగా మొదటి రోజు సిరిసిల్లకు చెందిన దూడం గణేశ్ రాసిన మాయమైన మనిషి కవిత్వ సంకలనాన్ని ప్రముఖ కవులు జూకంటి జగన్నాథం, నలుమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, నారాయణశర్మ, కల్వకుంట్ల రామకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మానేరు రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు పత్తిపాక మోహన్, వెలగంట రవి మాట్లాడుతూ, నేత కార్మికుడైన దూడం గణేశ్ మానవ విలువలు ప్రకృతి విధ్వంసంపై రచనలు చేయడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ శంకర్, కార్యక్రమ అధ్యక్షులు టివి నారయణ, అర్జున్, దీపిక, వేముల మార్కెండేయులు, నర్సింహులు, శ్రీమతి, పాకాల శంకర్, కామారపు శ్రీనివాస్, మడూరి అనిత ఉన్నారు.

### టేకు కలప పట్టివేత

చందుర్తి, మార్చ్25 : చందుర్తి, మోత్కులరావుపేట గ్రామాల మధ్య అక్రమంగా టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీ శాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నట్లు అటవీ శాఖ వేములవాడ డిప్యూటీ రెంజ్ అధికారి రాఘవేంద్రరావు తెలిపారు. అటవీ ప్రాంతంలో నుంచి టేకు కలప తరలిస్తున్నారన్న సమాచారం మేరకు.. కలపను మోత్కులరావుపేట శివారులో స్వాధీనం చేసుకుని, చందుర్తికి తరలించారు.

### జాతీయ స్థాయి పోటీలకు మాడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

ఇల్లంతకుంట, మార్చి 25 :మండలంలోని మోడల్ స్కూల్ తొమిదో తరగతి విద్యార్థిని పయ్యావుల వైష్ణవి కబడ్డీలో ప్రతిభ చూపి, జాతీయ కబడ్డీ సబ్ జూనియర్‌గా ఎంపికైందని ప్రిన్సిపాల్ గంగాధర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు బీహార్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. మారుమూల ప్రాంతం లోని రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ విద్యార్థిని జాతీయ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం సంతోంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు అభినందించారు. వైష్ణవి ఎంపికకు సహకరించిన జిల్లా కబడ్డీ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## శాంతకుమారికి ఉగాది పురస్కారం


తెలుగు ఉగాది పురస్కారంఅందుకుంటున్న శారద

సిరిసిల్ల టౌన్, మార్చి 25 : సిరిసిల్లకు చెందిన ప్రముఖ గాయని, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తుమ్మనపల్లి శాంతకుమారి తెలుగు వెలుగు ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ సంస్థ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో తెలుగు సాహిత్యంలో విశేష సేవలు అందిస్తున్న పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్లకు చెందిన తుమ్మనపల్లి శాంతకుమారి తెలుగు సాహిత్యంలో సేవలకు గానూ కార్యక్రమ విశిష్ట అతిథి సినీ నటుడు ఆర్ ఎస్ నందా చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సంస్థ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అక్కపల్లి యాదగిరి, మహిళా అధ్యక్షురాలు భీమనాతిని శారధ, గడిపె మల్లేశం పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడికి తెలుగు వెలుగు అవార్డు

గంభీరావుపేట, మార్చి 25: మండలంలోని గజసింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అక్కపల్లి యాదగిరిగౌడ్‌కు మంగళవారం తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు అవార్డును అందజేశారు. తెలుగు వెలుగు సాహితీ అకాడమి ఆధ్వర్యంలో ఉగాది పురస్కరించుకొని హుస్నాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ మిమిక్రీ ఆర్టిస్ట్‌గా యాదగిరిగౌడ్‌కు ఉత్తమ అవార్డును ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటులు ఆర్ఎస్ నంద, సీతామహాలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు.

## న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

వేములవాడ, మార్చి 25 : రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న ఇస్రాయల్‌ను కత్తులతో దారుణంగా పొడిచి చంపడాన్ని నిరసిస్తూ వేములవాడలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులు బహిష్కరించారు. హైదరాబాద్ చంపాపేట్ ప్రాంతంలో సోమవారం దస్తగిరి అనే వ్యక్తి తనపై కేసు పెట్టిన తన ప్రియురాలి చిరునామా చెప్పాలని కోరుతూ న్యాయవాది ఇజ్రాయిల్ పై కత్తులతో దాడి చేసి, అమానుషంగా హత్య చేయడంపై ఈ సందర్భంగా న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. దస్తగిరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజినీకాంత్, న్యాయవాదులు నేరెళ్ల తిరుమల గౌడ్, విద్యా సాగర్ రావు, రేగుల దేవేందర్, పొత్తూరు అనిల్ కుమార్, పిట్టల మనోహర్, పెంట రాజు, కొడిమ్యాల పురుషోత్తం, గోపికృష్ణ, ప్రతాప సంతోష్, గడ్డం ఉన్నారు.

## కనగర్తిలోని ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

కోనరావుపేట, మార్చి 25: మండలంలోని కనగర్తి ఎస్సీ కాలనీ, ఎంపీపీఎస్, జడ్పీ హెచ్ఎస్ పాఠశాలను మండల విద్యాధికారి మురళీనాయక్ తనిఖీ చేశారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరుపట్టికలతో పాటు విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్ ఉన్నారు.

## ఆస్తి పన్ను బకాయి దారులకు రెడ్ నోటీసులు

వేములవాడ, మార్చి 25: వేములవాడ పురపాలక సంఘం ఆస్తి పన్నుల వసూళ్లలో అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది పట్టణంలో ఆస్తి పన్నుల డిమాండ్ 4.09 కోట్లుగా ఉంది. అయితే గతేడాది రాజన్న ఆలయంతో కలిపి రూ. 4.60 కోట్ల ఆస్తి పన్నులు వసూలైనట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ కార్యాయాలతో కలిపి ఐదు కోట్ల లక్ష్యంగా పనిచేస్తున్నామని కమిషనర్ అన్వేశ్ తెలిపారు. పురపాలక సంఘంలో మొత్తం 10 రెవెన్యూ జోన్లు ఉండగా, ఒక్కోజోన్‌కు ముగ్గురు చొప్పున టార్గెట్ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సోమవారం నాటికి 3.45 కోట్ల వసూలతో 83 శాతంలో ఉన్నామని తెలిపారు.

**60 మంది బాకీదారులకు రెడ్ నోటీసులు..**

20 వేలకు పైగా మున్సిపల్ కార్యాలయానికి ఆస్తి పన్ను బకాయి ఉన్న 60 మంది బాకీదారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు. అయితే పురపాలక సంఘ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి చేపట్టాల్సిన కార్యక్రమాల దృశ్య కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఆస్తి పన్ను బకాయలు, సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ అన్వేశ్ కోరారు.

### ఆలయ ఉప ప్రధానార్చకుడికి ప్రధానార్చకుడిగా ఉద్యోగోన్నతి

వేములవాడ టౌన్ , మార్చి 25 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ఉప ప్రధానార్చకుడిగా విధులు నిర్వర్తిస్తున్న మామిడిపెల్లి రాములును ప్రధానార్చకుడిగా ఉద్యోగోన్నతి కల్పించినట్లు ఉత్వర్వులను మంగళవారం ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు మామిడిపెల్లి రాములును అభినందించారు.

### వేతనాలు నేరుగా కార్మికుల ఖాతాల్లో వేయాలి


కలెక్టరేట్, మార్చి 25: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే స్వీపర్, స్కావెంజర్స్ వేతనాలను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కాకుండా నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వ పాఠశాల స్వీపర్, స్కావెంజర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్వీపర్స్, స్కావెంజర్స్‌తో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. జిల్లా కోకన్వీనర్ బొడ్డు నర్సవ్వ, కే శోభ, బీ శ్యామల, మహేశ్ ఉన్నారు.


### ఒకరికి మూడేళ్లు జైలు


వేములవాడ, మార్చి 25: దొంగతనం కేసులో నింధుతుడికి మూడేళ్లు జైలుశిక్ష, ఆరువేయిల జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమశేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించిన్నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొడిమ్యాల మండలం పుడూర్‌కు చెందిన ఎంఎల్ నారాయణ వేములవాడ ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పని చేస్తుండగా హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన రోహిత్‌బాబులాల్ కాలే అనే వ్యక్తి నారాయణను మోసం చేసి రూ. 50 వేలు దొంగతనానికి పాల్పడ్డాడు. దీంతో 2023 అక్టోబర్ 28 వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేశ్ కోర్టులో సాక్షాలను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున విక్రాంత్ కేసు వాధించగా పూర్వ పరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి నింధుతుడికి జైలు శిక్షతో పాటు రూ .6 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించిన్నట్లు సీఐ పేర్కొన్నారు.

### ప్రజా శ్రేయస్సు ధ్యేయం

చందుర్తి,మార్చి 25: ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయమని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. పోలీసులు-మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మూడపెల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత లక్ష్యాలతో ముందుకు సాగి, అభ్యున్నతి సాధించాలన్నారు. క్రీడలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.


ఇల్లంతకుంట : నిరసన తెలుపుతున్న ఆశ కార్యాకర్తలు


ముస్తాబాద్‌లో..


చందుర్తి: నిరసన వ్యక్తం తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

# కదం తొక్కిన ఆశ కార్యకర్తలు

- ఊరూరా నిరసనలు
- హామీలు అమలు చేయాలని, రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్

**ఆశ కార్యకర్తలు కదం తొక్కారు. ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. హైదరాబాద్‌లోని ఆరోగ్య శాఖ కమిషనరేట్ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ మంగళ వారం జిల్లా వ్యాప్తంగా నిరసన, ధర్నా చేశారు.**


ఎల్లారెడ్డిపేట : గొల్లపల్లిలో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 25 : గొల్లపల్లి బస్టాండు వద్ద ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు. ఆరోగ్య బీమా, పని ఒత్తిడి తగ్గింపు విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలు లత, సునిత, లావణ్య, కవిత, జ్యోతి, స్రవంతి, సరిత, తార, రాణి, లక్ష్మి, రజిత ఉన్నారు.

**ఆశ కార్యకర్తల వాగ్దానాలను నెరవేర్చాలి**

ఇల్లంతకుంట, మార్చి 25 : ఆశ కార్యకర్తలకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ఆశ కార్యకర్తల మండలాధ్యక్షురాలు ఎస్ శాంత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల యూనియన్ పిలుపు మేరకు.. మంగళవారం మండలకేంద్రలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. మండల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంభీరావుపేట, మార్చి 25 : మండలకేంద్రంలోని ఆశ కార్యకర్తలు మంగళవారం సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. మండల ఆశ కార్యర్తలు భారతి, లక్కీరెడ్డి అరుణ, జ్యోతి, స్వరూప, రాణి, రజిత, స్వప్న, శ్రీమతి, పద్మ, శ్రీవాణి, శారద, దేవలక్ష్మి, లహరి, రాజమణి, మమత తదితరులు ఉన్నారు.

చందుర్తి, మార్చ్ 25 : ఆశ కార్యకర్తల అరెస్టు అప్రజాస్వామికమని ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు గాయత్రి అన్నారు. ఆశ కార్యర్తల అరెస్టుకు నిరసనగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్తాబాద్, మార్చ్ 25 : సమస్యలు పరిష్కరించాలని కోరితే పోలీసులచే అనిచివేత సరికాదని ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు బాధవేని మంజుల మండిపడ్డారు. ఆశ కార్యకర్తలను ముందుస్తు అరెస్టులు చేయడాన్ని నిరశిస్తూ మండల కేంద్రంలో ప్రధాన కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యర్తలు దేవిక, జ్యోతి, లక్ష్మి, నిర్మల, లావణ్య, కరుణ, మాధవి, దేవలక్ష్మి పాల్గొన్నారు.

కోనరావుపేట, మార్చి 25 : ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆశ వర్కర్లు కోనరావుపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు.

## రూ. 5.50 లక్షలకు తైబజార్ వేలం

ముస్తాబాద్, మార్చ్ 25 : పంచాయతీలో మంగళవారం తైబజార్ వేళానికి ఎంతో మంది పోటీకి రాగా, ఐదు లక్షల యాభైవేల రూపాయలకు ముస్తాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి దక్కించుకున్నాడు. ముస్తాబాద్‌లో వారసంత, గ్రామంలో రహదారులపై నిత్యం విక్రయాలు చేసుకునే వ్యాపారుల నుంచి వసూళ్లు చేసే రుసుం తైబజార్ కోసం గతేడాది రూ. 3 లక్షల 30 వేలు పంచాయతీకి రాగా, ఈ ఏడాది మరింత ఆదాయం పెరిగందని నిర్వాహకులు తెలిపారు. వేలం పాటలో ప్రత్యేకాధికారి తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో భీరయ్య, కార్యదర్శి రమేశ్, పాల్గొన్నారు.

## సౌలభ్యంగా 'పంచాయతీ' ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డిపేట/కలెక్టరేట్, మార్చి 25 : దూర భారం లేకుండా పాలన సౌలభ్యంగా ఉండేలా నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని మండలంలోని తిమ్మాపూర్, గుండారంలోని బొంగుల కింది తండావాసులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు విన్నవించారు. మంగళవారం బొంగుల కింది తండా వాసు లు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తుండగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, గతంలో నూతన పంచాయతీ ఏర్పా టు కోసం గుండారం, తిమ్మాపూర్‌కు అనుబంధంగా ఉన్న గ్రామాల ఎస్టీల వినతి మేర కు.. జై సేవాలాల్ తండాను ఏర్పాటు చేశారు. గుండారంకు చెందిన బొంగుల కింది తండా, తిమ్మాపూర్‌కు చెందిన రాజ్యానాయక్ తండాలను కలిపి నూతన పంచాయతీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. అయితే ఈ ఏర్పాటు పాలనా సౌల భ్యం లేకుండా ఉందని బొంగుల కింది తం డావాసులు ఆరోపించారు. దీనిలో బొంగుల కింది తండా ఉత్తర భాగం కలుపలేక పోవడంతో నూతన పంచాయతీ ఏర్పాటు గజిబిజిగా మారిందని చెప్పారు. తిమ్మాపూర్‌లోని రాజ్యానాయక్ తండాకు, గుండారంలోని బొంగుల కింది తండాకు మధ్య 4 కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. ఈ తండాలు ఒకే చోట ఉన్నందున వీటికి పాలనా సమస్య, దూర భారం ఉండదని దీన్ని దృష్టిలో ఉంచుకొని నూతన ప్రంచాయతీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. అనంతరం అడ్మినిస్టేట్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.

## భారత నౌకాదళానికి కొండాపూర్ విద్యార్థి ఎంపిక

కోనరావుపేట, మార్చి 25: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గొల్లపల్లి వివేకవర్ధన్ భారత నౌకాదళ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు గొల్లపల్లి దేవరాజ్, లత వ్యవసాయం చేసుకుంటూ వివేకవర్ధన్‌ను చదివిస్తున్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌లో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ ఉద్యోగ ప్రయత్నం చేశాడు. దీంతో భారత నౌకదళంలో ఎస్ఎస్ఆర్ ఉద్యోగానికి ఎంపిక కాగా, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు అభినందించారు.